క్లుప్తంగా

17న క్రాస్ కంట్రీ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని టీవీఆర్ హైస్కూల్ సమీపంలో 17న ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలను నిర్వహిస్తున్నట్లు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్ బాషా, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు వీరకళ్యాణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 16 ఏళ్లలోపు బాలబాలలకు 2 కిలోమీటర్లు, 18 ఏళ్లలోపు బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు రూ.4 కిలోమీటర్లు, 20 ఏళ్లలోపు బాలురకు 8 కిలోమీటర్లు, బాలికలకు 6 కిలోమీటర్లు, పురుషులకు, మహిళలకు 10 కిలోమీటర్ల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని వారు వివరించారు. పాల్గొనే వారు ఆధార్ కార్డుతో హాజరు కావాలని, ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 24న సామర్ల కోటలో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9949686586కు సంప్రదించాలని కోరారు.

బద్వేలు రూరల్ సీఐగా విక్రమసింహ



బద్వేలు అర్బన్ : బద్వేలు రూరల్ సీఐగా బి.వి.విక్రమసింహ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2004 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన చిత్తూరు జిల్లాలోని పలు స్టేషన్లలో ఎస్ఐగా పనిచేస్తూ 2013లో సీఐగా పదోన్నతి పొంది కర్నూలు జిల్లాలో సీఐడీ విభాగంలో, పత్తికొండ, కర్నూలు వన్‌టౌన్, కర్నూలు తాలూకా, సిరివెల్ల, దిశ పోలీసుస్టేషన్, ఆదోని వన్ టౌన్‌లలో సీఐగా పనిచేశారు. కర్నూలు రేంజ్‌లో ఇటీవల జరిగిన బదిలీల్లో బద్వేలు రూరల్ సర్కిల్‌కు నియమితులయ్యారు.

నూతన నియామకం



రమణ

పోరుమామిళ్ల : మండలానికి చెందిన కలవకూరి రమణను గురువారం వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ నాపై నమ్మకంతో స్టూడెంట్ విభాగానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని చేశారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశా, సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్, చంటి, సాల్మాన్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్, భానుమతి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కౌసలయ్య, రమాదేవి, సువర్ణ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పక్కాగా జరగాలి

కాశినాయన : అర్హులైన వారికి ఓటరుగా నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ అన్నారు. గురువారం సాయంత్రం తహసీల్దారు రామచంద్రుడు అధ్యక్షతన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్‌లు సక్రమంగా ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. అన్ని పోలింగ్ బూత్‌లను బీఎల్‌ఓలు పరిశీలించి నివేదికలు పంపాలని ఆదేశించారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికి ఓటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ల పంపిణీ



నరసాపురంలో రైతులకు మోటార్లు పంపిణీ చేస్తున్న హనుమంతరెడ్డి

కాశినాయన : మండలంలోని 7 మంది రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ద్వారా మంజూరైన మోటార్లు, పంపులను గురువారం జేసీఎస్ మండల కన్వీనర్ గుండం హనుమంతరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ పథకం కింద అర్హులైన వారికి బోరుబావులను తవ్విందని, ఈ నేపథ్యంలోనే మొదటి విడతగా 7 మంది రైతులకు మోటార్లు పంపిణీ చేశామని తెలిపారు. జనవరి నెలలో రెండవ విడతలో మిగిలిన వారికి పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రాజమౌళి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ మహిళలకే

ప్రొద్దుటూరు : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతోనే ఇవ్వడం జరుగుతోందని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీ రాణి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డీసీసీ బ్యాంకు ద్వారా జిల్లాలో రూ.220 కోట్ల రుణాలను డ్వాక్రా మహిళలకు మంజూరు చేశామన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు డ్వాక్రా రుణమాఫీ చేశారని అన్నారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు, కులమతాలకు అతీతంగా అందరికీ అందుతున్నాయన్నారు. ఏ నాయకుల ప్రమేయం లేకుండానే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు పథకాలను అందుకుంటున్నారన్నారు. గ్రామాభివృద్ధికి తాను అనేక రకాల చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఈ సచివాలయం పరిధిలో రూ.24,28,70,633 లబ్ధి చేకూరిందని వివరించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి సహపంక్తి భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాం రెడ్డి, సర్పంచ్ శివలక్ష్మి, ఉపసర్పంచ్ నరేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, ఈఓపీఆర్డీ శశిధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతి వీధి సచివాలయం ఆవరణలో గురువారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయం ఆవరణలో జెండా ఆవిష్కరించి అలాగే ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. సచివాలయ పరిధిలోని కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.17.51 కోట్లు, పరోక్ష ప్రయోజనాల కింద రూ.12.96 కోట్లు చొప్పున మొత్తం రూ.30.47 కోట్లు నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జగనన్నతోనే అందరికీ న్యాయం

పోరుమామిళ్ల : రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ రావాల్సిందేనని జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం పుల్లివీడు సచివాలయం వద్ద నిర్వహించిన మళ్లీ జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మొట్ట మొదటిసారి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ అన్ని వర్గాల వారికి సంక్షేమఫలాలు అందిస్తున్నారని, లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు గొడుగు మస్తాన్, వెంకటరెడ్డి, పంచాయతీ నాయకులు, ఎంపీడీఓ వరప్రసాదరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మోటారు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా మంజూరైన మోటార్లు, స్టార్టర్లు, పైపులను ఉచితంగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ జలకళ కింద రూ.4.17 లక్షలను ఖర్చును ప్రభుత్వమే భరించి ఉచితంగా మోటార్లు, స్టార్టర్లు, పైపులు అందజేసిందన్నారు. విత్తనం నుండి కొనుగోలు వరకు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నియోజకవర్గంలో 417 వైఎస్సార్ జలకళ బోర్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 390 బోర్లు వేశారన్నారు. వైఎస్సార్ జలకళలో బద్వేలు నియోజకవర్గం జిల్లాలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. వచ్చే వారంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతులమీదుగా తడుకుచెరువుకు బ్రహ్మంసాగర్ ద్వారా నీరు అందించేందుకు లిఫ్ట్ఇరిగేషన్ పనులకు భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, సుదర్శన్, పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, నారాయణయాదవ్, వైస్ ఎంపీపీ సి.బాషా, కాశినాయన, కలసపాడు మండలాల జేసీఎస్ కన్వీనర్లు గుండంహనుమంతరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, సింగరయ్య, ఎంపీడీఓ మహబూబ్‌బీ, కంపెనీ ప్రతినిధి టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన

కలసపాడు : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ నాలుగున్నర ఏళ్ళుగా జనరంజక పాలన సాగిస్తుందని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. గురువారం మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని పాత రామాపురం, ముసల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన కుటుంబాలను కలిసి బుక్‌లెట్‌ను ఇచ్చి ఆయా పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, నారాయణ యాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సర్పంచ్ ఓబులమ్మ, సింగరయ్య, ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఈఓపీఆర్‌డీ మురారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి



ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

బద్వేలు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టంను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బద్వేలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు గురువారం విధులు బహిష్కరించి స్థానిక సిద్దవటం రోడ్డులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.ఎస్.ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, డి.వి.ఎస్.ఆర్.కృష్ణలు మాట్లాడుతూ భూహక్కు చట్టం వలన ప్రజల స్థిరాస్థి హక్కులకు భంగం వాటిల్లుతోందన్నారు. అలాగే ఆస్థి హక్కును నిర్ణయించే అధికారాన్ని సివిల్ కోర్టు పరిధి నుంచి తీసివేసి రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసే ట్రిబ్యునల్ చైర్మన్‌కు అప్పగిస్తారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఈ చట్టంపై పునరాలోచన చేసి రద్దు చేయాలని కోరారు. తొలుత ఎన్‌జీవో కాలనీ నుంచి సిద్దవటం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

మైదుకూరు : విద్యుత్‌ను ఆదా చేయడం అందరి బాధ్యత అని మైదుకూరు ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం మైదుకూరులో విద్యుత్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ గురువారం నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జరుగుతాయన్నారు. బీఈఈ వారి సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఏపీ ఇంధన శాఖ సహకారంతో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ వృథా కాకుండా కాపాడాలని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఎల్ఈడీ బల్బులు, ఫైవ్ స్టార్ రేటింగ్ కలిగిన పరికరాలను వాడటం, ఇండస్ట్రీస్‌లో కెపాసిటర్స్ వాడుకోవడం చేయాలని తెలిపారు. ఎయిర్ కండిషనర్ 25 సెంటీగ్రేడ్ పైన పెట్టుకోవడం, అవసరం లేని చోట స్విచ్‌లు ఆఫ్ చేసుకోవడం ఇవన్నీ చేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వనిపెంట, దువ్వూరు ఏఈలు వెంకటేష్, వీరారెడ్డి, టెక్నికల్ ఏఈ అబ్దుల్ జబ్బర్, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌కు క్లాప్ డ్రైవర్ల వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : ఏపీ క్లాప్ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న 37 మంది క్లాప్ డ్రైవర్లకు ఆరేడు నెలలు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని తెలిపారు. జీఓ 7 ప్రకారం రూ.18,500 వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టాలని, సెలవులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. రెడ్డి ఏజెన్సీని రద్దు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్, ఉపాధ్యక్షులు రమాదేవి, గుర్రమ్మ, ప్రమీలమ్మ, జాకోబ్ పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్ప

ప్రొద్దుటూరు కల్చరల్ : చాపాడు మండలం పల్లవోలు గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 19న నిర్వహించే జిల్లా సైన్స్‌ఫెయిర్‌ను విజయవంతం చేయాలని ఉప విద్యాశాధికారి జి.కృష్ణప్ప తెలిపారు. గురువారం స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లతో జిల్లా సైన్స్‌ఫెయిర్ నిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌ఫెయిర్‌ను విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతుల విద్యార్థులు హాజరై వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ విభాగాలలో ముందుగా తెలిపిన 8 అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. 36 మండలాల నుంచి 108 ప్రదర్శనలు ప్రదర్శిస్తారని తెలిపారు. సన్నాహక కమిటీలలో వారి విభాగాలలో పని విభజన చేశారు. ఆయా కమిటీల సమన్వయంతో జిల్లా సైన్స్‌ఫెయిర్‌ను విజయవంతానికి సూచనలు చేశారు. చాపాడు మండలం పల్లవోలు ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 19న ఉదయం 9 గంవటలకు ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, క్రిష్టఫర్, ప్రెస్‌కమిటీ సభ్యులు వై.గోపినాథరెడ్డి, డి.చంద్రశేఖర్‌రావు, ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయ బృందం

చాపాడు : స్థానిక గూడూరు అప్పయ్య గారి సుబ్బరాయుడు జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన పోటీలు ఆకట్టుకున్నాయి. మండలంలోని ఏడు జెడ్పీ హైస్కూల్‌లు, కేజీబీవీ, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ రకాలైన సైన్స్ ప్రదర్శనలు చేశారు. ఇందులో విద్యార్థి విభాగంలో లక్ష్మీపేట హైస్కూల్‌కు చెందిన వీర రాజేష్(10వ తరగతి) గ్యాస్ లీకేజ్ అలెర్ట్ సిస్టమ్, స్టూడెంట్ గ్రూప్‌లో నరహరిపురం హైస్కూల్‌కు చెందిన టి.నరసింహభార్గవ్ (9వ తరగతి), విష్ణువర్దన్ (8వ తరగతి)లు సెఫ్టీ అండ్ ట్రాకింగ్ సిస్టం, ఉపాధ్యాయ విభాగంలో చాపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడు హరినాథ్ చంద్రయాన్-2పై చేసిన ప్రదర్శనలు గెలుపొందాయి. మండలస్థాయిలో గెలుపొందిన ప్రదర్శనలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వంశీకృష్ణ, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాలి



ఆర్‌ఎంపీ వైద్యశాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి

చాపాడు : ఆర్‌ఎంపీ వైద్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ అన్నారు. చాపాడులో గురువారం ఆర్‌ఎంపీ వైద్యశాలలను ఆయన పరిశీలించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ఓ వైద్యశాలను మూసి వేయించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్‌ఎంపీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఆర్‌ఎంపీ వైద్యులకు కేవలం ప్రథమ చికిత్సను మాత్రమే చేయాలని, ఇతర వైద్య సేవలు అందించరాదన్నారు. ఇదే క్రమంలో బాలకార్మికులతో ఎలాంటి పనులు చేయించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం ఉల్లంఘించినా వైద్యశాలలను మూసివేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఓబులేసు, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆప్తాలమిక్ వైద్యులు తేజ, సూపర్‌వైజర్ సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఏఎన్‌ఎంలు స్రవంతి, సునీత, గ్రేసమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఈఈ, డీఈఈలు, ఏఈలు

ప్రొద్దుటూరు : స్థానిక ప్రొద్దుటూరు డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్ద నుంచి శివాలయం వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఏపీఎస్‌పీడీసీఎల్ ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఇంధన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌ను వినియోగదారులు పొదుపుగా వినియోగించడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు బిఎస్ఐ స్టాండర్డ్ రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించాలని సూచించారు. అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయాలని, విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, ఓఎస్‌ఎం సిబ్బంది పాల్గొన్నారు.

బైబిల్ మిషన్ ప్రార్థనశాల ప్రారంభం



ఆరాధన ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



మాట్లాడుతున్న శెట్టిపల్లె నాగిరెడ్డి

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామం వద్ద బైబిల్ మిషన్ ప్రార్థనశాల ప్రతిష్ట ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్ ప్రారంభోత్సవానికి మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి అద్భుతమైన బైబిల్ మిషన్ చర్చిని నెలకొల్పడం నియోజకవర్గానికి గర్వకారణమన్నారు. ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దైవకార్యానికి వేలాది మంది భక్తులు హాజరవ్వడం హర్షణీయమన్నారు. ఏసుక్రీస్తు దీవెనలు మీ అందరిపై ఉండాలని ప్రార్థించారు. అక్కడికి వచ్చిన వారందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బైబిల్ మిషన్ నిర్వాహకుడు అద్భుత కుమార్ మాట్లాడుతూ ఈ ప్రార్థన శాలకు కరెంటు, రోడ్లు, నీటి సౌకర్యాల కోసం సహకరించిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్‌తోపాటు విదేశీయులు, రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొన్నారు. దువ్వూరు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, గుడిపాడు ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సర్పంచ్ మాబు షరీఫ్‌లు హాజరయ్యారు.

తైక్వాండో జాతీయ పోటీల్లో బంగారు పతకం



గోల్డ్ మెడల్ సాధించిన నదీష్‌తో కోచ్ సుభాష్

పోరుమామిళ్ల : ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల వారియర్స్ అకాడమీ విద్యార్థి నదీష్ బంగారు పతకం సాధించిందని అకాడమీ కోచ్ సుభాష్ తెలిపారు. గురువారం సుబాష్ మాట్లాడుతూ పోటీల్లో పోరుమామిళ్ల నుంచి నదీష్‌తో పాటు దీపిక, పునీత్ పాల్గొన్నారన్నారు. బంగారు పతకం సాధించిన నదీష్‌ను అభినందించారు.

ఆరోగ్య అవగాహన సదస్సు



కస్తూర్బాగాంధీ పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గీత

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న యుక్తవయస్సు బాలికలకు పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినీలకు యుక్తవయస్సులో వచ్చే శారీరక మార్పుల గురించి, వారిలో కలిగే ఆందోళనల గురించి అవగాహన కల్పించారు. యోగా, ధ్యానం చేయాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : ఈ నెల 8న విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐ హైమావతిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. గురువారం పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలు కాపాడే పోలీసులకే రక్షణ లేకపోతే, ఇక సామాన్యులకు పోలీసు వ్యవస్థ మీద ఎంత వరకు విశ్వాసం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి షరీఫ్, కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, హరి, గురుస్వామి పాల్గొన్నారు.

కుంటి మల్లారెడ్లకు ప్రభుత్వ గుర్తింపు హర్షణీయం



మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : కుంటిమల్లారెడ్డి కులానికి ప్రభుత్వ గుర్తింపు నివ్వడం హర్షణీయమని కుంటిమల్లారెడ్డి సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు కత్తి వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకులం వారు బిక్షగుంట కులంగా గుర్తింపు పొందారన్నారు. 1963 నుంచి తమ కులం పేరు చెప్పకోలేక ఇతర కులాల్లోకి వలస వెళ్లారన్నారు. కుంటిమల్లారెడ్డి కులంలో 32 తెగలు ఉన్నాయని, గుర్తింపు కోసం ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తమ కులానికి గుర్తింపు నివ్వడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించడం జరిగిందన్నారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి తమ కులానికి గుర్తింపు ఇచ్చినందుకు సత్కరించడం జరిగిందన్నారు. ఇతర కులాల్లోకి వలస వెళ్లిన వారు తిరిగి రావాలని, త్వరలో చేపట్టే కులగణనలో కుంటిమల్లారెడ్లుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

పోరుమామిళ్ల : ఏఐటీయూసీ మండల శాఖ నూతన అధ్యక్షులుగా పిడుగు పీరయ్య, షేక్ మహమ్మద్ హుసేన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోరుమామిళ్లలో బుధవారం జరిగిన ఏఐటీయూసీ మహాసభలో వారితో పాటు కోశాధికారి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులను, మరో 17 మందిని మండల నూతన కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీల నిరసన

దువ్వూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల పనిభారం తగ్గించి, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు శివరాం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు చెన్నమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు సహాయకులు పాల్గొన్నారు.

18 నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

ప్రొద్దుటూరు : పోరుమామిళ్లలో ఈ నెల 18, 19వ తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ తెలిపారు. గురువారం స్థానిక శారద జూనియర్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయభాస్కర్, గుర్రప్ప, సుబ్బయ్య పాల్గొన్నారు.